# తులసి

జి.ఆర్. మహర్షి



వేసవికాలం, వెన్నెల రాత్రి.

వెన్నెల జల్లెడ పడుతున్న చల్లటి చెట్టు. ఆ చెట్టు కింద నేనూ, ప్రకాష్ భోజనాలు ముగించాం. ప్రకాష్ గృహస్తు; నేను అతిథిని; మేమిద్దరం ఒకే ఫ్యాక్టరీలో పని చేస్తున్నాం.

ప్రకాష్ భార్య లక్ష్మి, తమలపాకులకు సున్నం రాస్తూ ఉంది. ఆమె ఒళ్ళో రెండేళ్ళ బాబు హాయిగా నిద్ర పోతున్నాడు.

''ఒక మంచి కథ చెప్పు ప్రకాష్'' అని అడిగాను. కథలు అద్భుతంగా చెప్పగలడు ప్రకాష్.

ప్రకాష్ కొన్ని క్షణాలు మౌనంగా, గంభీరంగా వుండిపోయాడు.

చంద్రుడు చెట్టు కొమ్మల్లోంచి తొంగిచూస్తున్నాడు. గాలి ఆకులని జోకొడుతూ వుంది.

''ఈ కథ చెప్పాలని చాలా రోజుల్నుంచి అనుకుంటున్నాను. ఎన్నోసార్లు నోటి వరకూ వచ్చిన కథను బలవంతంగా అదిమేశాను. ఇతరుల జీవితాల్లోని

కథలు చెప్పడం సు  భమేకాని, మన జీవితాల్లోని కథలు చెప్పాలంటే  . గాత్రం కొంచెం ధైర్యం కావాలనుకుంటాను. రక  కాల భయాలు, సంకోచాల వల్ల, చాలా కథలు ఎప్పటికీ బయటికి రాకుండా అణగారిపోతాయి. ఒక చిన్న సంఘటన వల్ల జీవితం విచిత్రమైన మలుపు తిరుగుతుంది. నా జీవితంలో జరిగిన అటువంటి సంఘటన గురించి చెపుతాను విను'' అన్నాడు ప్రకాష్.

చల్లగాలి శరీరాన్ని సున్నితంగా స్పర్శిస్తూ వెళ్ళింది.

కథ ప్రారంభించాడు.

 OOO


మాది చిన్న పల్లెటూరు. వంద ఇళ్ళకు మించి వుండవు. మాకు యాభై ఎకరాల భూమి వుండేది. మాది కరువు ప్రాంతం. వానలు బాగా కురిస్తేనే పంటలకు అంత భూమి వున్నా మేమేమి స్థితిపరుల కింద లెక్కకాదు. పదెకరాల రైతు కూడా కడుపు నిండా తిండికి కూడా నోచుకోని ప్రాంతం మాది.

ఊర్లో నాన్నదే పెద్దరికం. ఊర్లో ఏ గొడవ జరిగినా ఆయనే పంచాయతీ చేసేవాడు. అధికారులు ఎవరొచ్చినా మా ఇంట్లోనే భోజనాలు. ఎన్నికలొస్తే ఆయనదే పెత్తనం. ఇంట్లో అమ్మకి కొంచెం కూడా విలువుండేది కాదు. నాన్న ఆజ్ఞలని పాటించడమే ఆమె పని. వేళగాని వేళ పది మందిని తీసుకొచ్చి భోజనం పెట్టమనేవాడు నాన్న. కట్టెల పొగలో, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ ఆమె వండేది. రోజులో ఎక్కువ భాగం ఆమె వంట ఇంట్లోనే వుండేది.

నాన్న మాటల్లో తరచుగా 'మన వంశం, మర్యాద, పరువు' ఇలాంటి పదాలు దొర్లేవి. అమ్మా నాన్నలకు నేనొక్కడే కొడుకుని. అక్కా చెల్లెళ్ళు లేరు. గారాబంగా, మూర్ఖంగా పెరిగాను.

నా ఈడు పిల్లలందరికీ నేనే నాయకుడిని. నన్నెవరైనా ధిక్కరిస్తే వాళ్ళని నానా హింస పెట్టేవాణ్ని. స్నేహితులంతా నా పట్ల భయంతో, వినయంతో వుండేవాళ్ళు... ఒకసారి ఒక కుర్రాడు నాకు ఎదురు తిరిగాడు. నేను నా గుంపును ఉసిగొలిపి వాడి చొక్కాను చీలికలు పీలికలు చేయించాను. ఆ పీలికలు చేత్తో పెట్టుకుని వాడు గుండె పగిలేలా ఏడ్చాడు. మరుసటి రోజు నుంచి వాడు స్కూల్‌కి రాలేదు. ఎందుకంటే వాడికున్నది అదొక్కటే చొక్కా!

మా పక్క ఊళ్ళో హైస్కూల్ ఉండేది. ఊళ్ళోని పిల్లలంతా నడుచుకుంటూ స్కూల్‌కి వెళ్ళేవాళ్ళు. నేను మాత్రం సైకిల్‌లో వెళ్ళేవాణ్ని. ఆలస్యంగా స్కూల్‌లో చేరడం వల్ల, టెన్త్ పరీక్షలు రాసే నాటికే నా వయసు పదిహేడేళ్ళు. క్లాస్‌లో అందరికంటే దృఢంగా మొరటుగా ఉండేవాణ్ని.




స్వతహాగా కొంచెం తెలివి తేటలు వుండటం వల్ల, యథేచ్ఛగా కాపీలు కొట్టడం వల్ల, పదవ తరగతి సెకండ్ క్లాస్‌లో పాసయ్యాను. ఊరు మొత్తం మీద నేనొక్కణ్ణే పాసయ్యాను. దాంతో మా నాన్న మీసాలు మెలితిరిగాయి.

ఆ రోజు రెండు పొట్టేళ్ళు తెగాయి. ఊరంతా విందు ఘుమఘుమ! జనం బ్రేవ్‌మని త్రేన్చి నన్నూ, మా నాన్ననూ పొగిడారు. నాలాంటి కొడుకుని కనడం నిజంగా నాన్న అదృష్టమన్నారు.

విందు పనుల అలసటతో అమ్మ వారం రోజుల పాటు ఒళ్ళు నొప్పులు, జ్వరంతో బాధపడింది.

టవున్లో ఇంటర్ చేరాను. టవున్ అద్భుతమైన ఇంద్రలోకంగా కనిపించింది. ప్రతి రోజూ సినిమా హాళ్ళకు హాజరయ్యేవాణ్ని. ఇంటి దగ్గర నుంచి అడిగినంత డబ్బు వచ్చేది. రెండేళ్ళు పాదరసంలా జారిపోయాయి.

ఈ రెండేళ్ళలో కేవలం నాలుగే నాలుగుసార్లు ఊరికెళ్ళాను. సెలవుల్లో కూడా ప్రయివేటు క్లాసులనీ, ట్యూషన్లనీ అబద్ధాలు చెపుతూ టవున్లోనే గడిపేశాను. చచ్చీచెడి కాపీలు కొట్టి, రెండేళ్ళ పరీక్షలు ఒకేసారి రాసి ఇల్లు చేరుకున్నాను.

స్నేహితులందరూ కలిశారు. సాయంత్రం అందరమూ ఊరిబయటికి షికారెళ్ళాం. అక్కడ నేను ఆశ్చర్యపోయే దృశ్యమొకటి కనిపించింది.

ఒక అందమైన పూరిల్లు. బయట పేడతో అలికిన నేల. ఆ నేల మీద కనువిందు చేసే ముగ్గులు. ఇంటిచుట్టూ చిన్న కంచె. కంచె లోపల బుల్లి తోట. పసిపాపల్లాంటి పూలమొక్కలు. గాలికి తలలూపుతున్న రంగురంగుల గులాబీలు. ఎవరో ఋషి తపస్సు కోసం నిర్మించుకున్న పర్ణశాలలా వుంది.

''ఈ ఇల్లెవరిదిరా? ఇంతకు ముందెప్పుడూ కనిపించలేదు!'' అని అడిగాను.

''ఆ ఇల్లు ఒక బ్రహ్మరాక్షసిది. ఆ రాకాసి పేరు తులసి'' అని చెప్పారు.

తులసి. ఆ ఆపేరు నాకు బలే ఇష్టంగా అనిపించింది.

''వాళ్ళది మన ఊరు కాదు. తులసి తండ్రి చీనీ తోటలు పెట్టి చితికిపోయాడు. అక్కడ బతకలేక, మన ఊరు వచ్చి, నాలుగెకరాల భూమి కొనుక్కొని ఈ ఇల్లు వేసుకున్నారు. తులసంటే మన వాళ్ళందరికీ హడల్. మన వెంకటయ్య కొడుకు తెలుసుకదా, వాడు ఒక రోజు భుజం తగిలించాడని చొక్కా పట్టుకొని తన్నబోయింది. దాని నోటికి ఎంతటోడైనా వణికి చావాల్సిందే'' అని చెప్పారు.

ఆ మాటలకు నాలో కుతూహలం పెరిగింది. రోషం కూడా వచ్చింది.

''ఏందిరా ఆడంగి మాటలు, ఒక ఆడపిల్లకు భయపడటమా? ఆ పిల్లేమైనా ఝాన్సీలక్ష్మీనా? రుద్రమ దేవా?'' అన్నాను.

''సరే నువ్వు పెద్ద మగధీరుడివి కదా, వెళ్ళి ఆ గులాబీని కోసుకురా చూద్దాం'' అని రెచ్చగొట్టారు.

''ఎంత పందెం?'' అన్నాను.

''పది రూపాయలు.''

నా స్నేహితులు కొంచెం దూరంలో చెట్టుకింద నిలబడ్డారు.

నేను అడుగుముందుకేశాను. ఆ అడుగు నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది.

ఇంటి ఆవరణ ముందున్న చెక్క తలుపును మెల్లిగా తోశాను. అది కిర్రుమంటూ చప్పుడు చేస్తూ తెరచుకుంది. వెళ్ళి గులాబీల ముందు నిలబడ్డాను. సున్నితంగా, మృదువుగా, అమాయకంగా వున్న గులాబీని తుంచడానికి నాకు ఒక్క క్షణం చేతులు రాలేదు. అయినా పందెం గుర్తొచ్చి గులాబీ మీద చెయ్యి వేశాను.

ఇంతలో పూరిల్లు తలుపులు బళ్ళున తెరుచుకున్నాయి. స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుని ఒక దేవత నా ముందు ప్రత్యక్షమయినట్టుగా అనిపించింది.

నా ఎదురుగా పదిహేడేళ్ళ అమ్మాయి. ఆమె తులసి.

చామనచాయ శరీరం. ఆ శరీరంలో ఏదో ఉజ్వలమైన మెరుపు. కోలముఖం, కొనదేరిన ముక్కు. పెద్ద

పెద్ద కళ్ళు. ఆ కళ్ళల్లో నీడ చూసుకుంటూ ఏ మగ వాడైనా ఒక జీవిత కాలాన్ని, క్షణంలాగా గడిపేయ వచ్చు. ఎంత పెద్ద జడ అంటే, ఆ జడతో ఉరివేసు కుంటే, ఆత్మహత్య పాపం కానేకాదు. ఆకుపచ్చ చీర కట్టుకొని, అదే రంగు జాకెట్టు వేసుకుంది. మొహానికి చిన్న బొట్టు, చెవులకు రింగులు, ముక్కుకు చిన్న ముక్కెర.

ఆ పెద్ద కళ్ళలో ఒక్క క్షణం నన్ను చూసి ఆశ్చ ర్యం. వెంటనే ఆగ్రహం పొంగింది. ''ఎవడ్రా నువ్వు?'' అంది. కరుగ్గా వున్నా, కంఠం మధురం గానే ఉంది.

'రా' అనే సరికి నాకు కోపమొచ్చింది.

''మాటలు మర్యాదగా రానీయ్'' అన్నాను.

''దొంగలకి కూడా మర్యాద ఇవ్వాల్నా'' అంది.

''ఒక గులాబీ కోసుకుంటే నీ సొమ్మేమీ పోదు'' అన్నాను.

''పసిబిడ్డల్ని సాకినట్టు సాకినా ఆ మొక్కల్ని, గులాబీ మీద చెయ్యి వేస్తే, మొహాన పేడ నీళ్ళు చల్లు తా'' అని దగ్గరలో వున్న పేడ నీళ్ళ బక్కెట్టు అందు కుంది.

ఒక్క క్షణం అక్కడ వున్నా, అన్నంత పని చేస్తుం దని నాకు అర్థమయింది. వెంటనే అక్కడ నుంచి గబగబా వచ్చేశాను. వస్తూ వస్తూ ''నీ సంగతి చూస్తా'' అన్నాను.

''నీలాంటి వాళ్ళని చాలా మందిని చూశాను'' అని బదులొచ్చింది.

అవమానంతో క్రుంగిపోయి వున్న నన్ను చూసి, నా స్నేహితులకి పలకరించడానికి కూడా ధైర్యం చాల లేదు.

మౌనంగా ఇల్లు చేరాను.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

పదే పదే తులసి అందమైన కళ్ళు గుర్తుకొస్తు న్నాయి. జరిగిన అవమానం కూడా గుర్తుకొస్తూ ఉంది.

తులసి మీద ప్రతీకారం తీర్చుకోకపోతే, స్నేహి తుల ముందు తలెత్తుకుని తిరగలేను.

ప్రతీకారం తీర్చుకోడానికే నిర్ణయించుకున్నాను.

 OOO

మరుసటి రోజు ఉదయాన్నే మా పక్కింటి కుర్రా డిని పిలిచాను. వాడి పేరు నాగరాజు. వయసు పదే ళ్ళు. చిచ్చరపిడుగు. తులసిమీద నిఘా వేయమని చెప్పాను.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు వాడు పరిగెత్తు కొచ్చాడు. తులసి ఒంటరిగా సద్దిగంప తీసుకుని, చేను వైపు వెళుతూ వుందని వర్తమానం తెచ్చాడు.

నేను బయలుదేరాను. వెంట నాగరాజును




కూడా తీసుకెళ్ళాను. తులసిని నేను అవమానించా నని, నా స్నేహితులకు తెలియజేయడానికి సాక్ష్య ముండాలిగా!

అడ్డదారిలో వేగంగా బయలుదేరి, చేను దోవను చేరుకున్నాను.

కొంచెం దూరంలో తులసి వస్తూ కనిపించింది. కనుచూపు మేరలో ఎవ్వరూ లేరు.

చంకలో సద్దిగంప పెట్టుకుని, వనకన్యలా తులసి వస్తూ కనిపించింది. నాగరాజు ఒక చెట్టు చాటున వుండిపోయాడు.

హఠాత్తుగా తులసి దారికి అడ్డంగా నిలిచాను.

తులసి ఒక్క క్షణం భయపడింది. వెంటనే భయాన్ని కప్పి పుచ్చుకుంటూ ''దారి వదులు'' అంది నిర్లక్ష్యంగా.

''వదులు తాను. నిన్న నన్ను అవమానించి నందుకు క్షమాపణ చెప్పు'' అన్నాను.

నన్నో పురుగుని చూసినట్టు చూసింది తులసి.

''వొట్టి క్షమాపణలు కాదు. నా కాళ్ళ మీద పడి క్షమాపణలు చెప్పాలి'' అన్నాను.

''నీలాంటి కుక్కల కాళ్ళు పట్టుకోవాల్సిన ఖర్మ నాకు పట్టలేదు'' అంది ఈసడింపుగా. ఆ మాటతో నాకు కోపం నసాళానికి వెళ్ళింది. విచక్షణా జ్ఞానాన్ని పూర్తిగా కోల్పోయాను.

''ఏం కూశావే'' అంటూ చెయ్యి పట్టుకున్నాను. విదిలించుకోబోయింది. నేను బలవంతంగా దగ్గరికి లాక్కుని, చెంపమీద ముద్దు పెట్టుకున్నాను. నా చెంప మీద ఈడ్చికొట్టింది.

ఒక ఆడపిల్లని ముద్దు పెట్టుకోవడం అదే నాకు మొదటిసారి. ఆ ముద్దు ఎంత చప్పగా, హీనంగా వుందంటే, నాలో ఎలాంటి భావనా కలగలేదు.

ఒక కొయ్య పలకని ముద్దు పెట్టుకున్నట్టు అని పించింది. బలవంతంగా తీసుకునే దేంట్లో కూడా ఆనందం వుండదని అర్థమయ్యింది. ఈ పెనుగు లాటలో తులసి చేతిలోని సద్ది గంప పడిపోయి, అన్నమంతా నేలపాలయ్యింది. తులసి వున్న చోటునే కుప్పకూలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది.

తప్పు చేశానని నాకు అర్థమైపోయింది. ఏడు స్తున్న తులసిని, నా గుండెల్లో దాచుకుని ఓదార్చాలని పించింది. కాని ఆ పని చేయలేకపోయాను. కొన్ని క్షణాలు శిలా ప్రతిమలాగా అక్కడే నిల్చుండి పోయాను. తరువాత అక్కడి నుంచి వెళ్ళి పోవడానికి అడుగేశాను. ఇంతలో రివ్వున ఒక రాయి వచ్చి నా నుదుటిని తాకింది. బొటబొటా నెత్తురు కారింది. తులసి చేతికి మరో రాయి అందేలోగా అక్కడి నుంచి పరిగెత్తుతున్నట్టు వచ్చేశాను.

చెట్టుచాటున వున్న నాగరాజు కనిపించలేదు. వాడు అప్పటికే ఊర్లోకి వెళ్ళి అగ్గిపుల్ల గీసేశాడు. జనం యథాశక్తీ ఆ మంటకు ఊపిరిపోశారు.

నేను తులసిని రేప్ చేయబోయానని వాడు ఊర్లో చెప్పాడు. తులసిని నేను రేప్ చేశానని ఊర్లో చెప్పుకు న్నారు.

కారుతున్న నెత్తురిని, కర్చీఫ్‌తో అదిమిపెడుతూ, నేను ఊళ్ళోకి వెళ్ళకుండా రెండు గంటల సేపు ఊరి బయట తచ్చాడుతూ గడిపాను. ఊళ్ళో కాలుబెట్టే సరికి, జనం నా వంకా, నా గాయం వంకా వింతగా చూడసాగారు. నేను ఎవరి వైపూ చూడకుండా ఇంటి కెళ్ళాను.

ఇంట్లో అడుగుపెట్టేసరికి నలుగురైదుగురు పెద్ద మనుషులు మా ఇంట్లో వున్నారు. వాళ్ళల్లో తులసీ తండ్రి కూడా వున్నాడు. వాళ్ళ ముందు మా నాన్న తలదించుకుని వున్నాడు. నన్ను చూడగానే మా నాన్న కళ్ళలో నిప్పులు కురిశాయి. ఒక్కుదుటున వచ్చి నా చెంపమీద కొట్టాడు. ఎంత గట్టిగా కొట్టా డంటే ఆ దెబ్బకు నేను కళ్ళు తిరిగి పడిపోయాను.

ఆ రోజు సాయంత్రమే నన్ను తిరుపతికి పంపించి వేశాడు మా నాన్న. తిరుపతిలో మా అన్న అంటే పెద నాన్న కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు. అన్న దగ్గరికి వెళ్ళి, నాన్న ఇచ్చిన ఉత్తరాన్ని ఆయన చేతిలో పెట్టాను. అందులో ఏముందో నాకు తెలి యదు.

అది చదివిన తరువాత ''ఎంత పని చేశావురా, అసలే మీ నాన్న పరమ మూర్ఖుడు. నీతో జీవితాంతం తెగతెంపులు చేసుకున్నా ఆశ్చర్యం లేదు'' అన్నాడు

మా అన్న.

మా అన్న ఇంట్లో నెల రోజులున్నాను. రాత్రిళ్ళు నిద్రపట్టేది కాదు. ఏడుపొచ్చేది. తులసి ఎట్లా వుందో అని దిగులేసేది. ఊళ్ళో వాళ్ళు ఏమేమి మాటలంటున్నారో అని దుఃఖమొచ్చేది.

నెల రోజుల తరువాత మా అన్న నాకు ఒక ఫ్యాక్టరీలో ఉద్యోగం చూసిపెట్టాడు. ఫ్యాక్టరీ దగ్గరే ఒక రూము తీసుకున్నాను. తరువాత మా అన్న ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయాడు.

సంవత్సరం రోజులు ఇంటితో సంబంధం లేకుండా గడిపాను. మా ఇంటి నుంచి ఒక్క ఉత్తరం కూడా రాలేదు. నా స్నేహితులకు రెండు మూడు ఉత్తరాలు రాశాను. అవి చేరాయో లేదోగాని, బదులు మాత్రం రాలేదు.

సంవత్సరం తరువాత ఉండబట్టలేక ఊరికి బయలుదేరాను. మా నాన్న నా వైపు కూడా చూడలేదు. అమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంది. సూట్‌కేసు ఇంట్లో పెట్టి, ఊళ్ళోకి వెళ్ళి నా స్నేహితుల్ని కలిశాను.


నేనడిగిన మొదటి ప్రశ్న ''తులసి ఎట్లా ఉంది?'' అని.

''నీ వల్ల తులసికి జీవితమే లేకుండా పోయింది'' అన్నారు.

నా నెత్తిన పిడుగుపడ్డట్టయ్యింది.

''నువ్వు వెళ్ళిన తరువాత, ఊళ్ళో వాళ్ళు తులసిని సూటిపోటి మాటలని అవమానించే వారు. కాని తులసి ఎవరినీ లెక్క చేయకుండా తిరిగేది. కాని తులసి తల్లిదండ్రులు మాత్రం, వెంటనే తులసికి పెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నారు. నాలుగైదు సంబంధాలు వచ్చాయి. తులసి శీలం మంచిదికాదు కాబట్టి కట్నం ఎక్కువ కావాలని అడిగేవాళ్ళు. చివరికి తులసి తండ్రి విసిగిపోయి, పొరుగూర్లో ఉన్న మేనరికాన్నే ఖాయం చేశాడు. పెళ్ళి ఇష్టం లేదని తులసి ఎదిరించింది. కాని బలవంతంగా పెళ్ళి చేశారు. తులసి మొగుడు తాగుబోతు, అనుమానం మనిషి. తులసి కాసేపు మౌనంగా వుంటే చాలు 'నీ పాత ప్రియుడు గుర్తుకొస్తున్నాడా?' అని అడిగేవాడట. వాణ్ని భరించలేక తులసి పుట్టిల్లు చేరింది. ఒక రోజు వాడొచ్చి పంచాయతీ పెట్టించాడు.

వాడితో కాపురం చేయనని తులసి తెగేసి చెప్పింది. 'ఊర్లో రంకు మొగుళ్ళుంటే, అసలు మొగుడితో పనేముందిలే' అన్నాడు వాడు. తులసి వాణ్ని కాలితో ఒక్క తన్ను తన్నింది. తాళి తెంచి వాడి మొహాన విసిరికొట్టింది. తాళిబొట్టు చూసి వాడు సంబర పడిపోయి 'దీంతో పది రోజులు తాగొచ్చు' అని వెళ్ళిపోయాడు. అప్పటి నుంచి తులసి ఈ ఊళ్ళోనే వుంది'' అని చెప్పారు.




నేను వెంటనే తులసి ఇంటి దగ్గరికి వెళ్ళాను. ఆ ఇంటికి మునుపటి కళాకాంతులు లేవు. ఏదో శాపాన్ని అనుభవిస్తున్నట్టుగా వుంది. ఇంటి ముందున్న చెట్టు కింద నిలబడ్డాను. పాప భారం నన్ను దహించి వేస్తోంది. క్షణమొక యుగంగా అక్కడ నిల్చున్నాను.

కాసేపటికి నీళ్ళ బిందె చంకన పెట్టుకొని తులసి బయటికి వచ్చింది. మనిషి చిక్కిపోయి వుంది. బుగ్గలన్నీ పీక్కుపోయి వున్నాయి. కళ్లలో మాత్రం మెరుపు తగ్గలేదు.

''తులసీ'' అంటూ దగ్గరికి వెళ్ళాను.

ఒక్క క్షణం ఆమె నన్ను గుర్తించలేదు. గుర్తించిన మరుక్షణం ఆమె కళ్ళల్లో జుగుప్స, ద్వేషం పొంగిపొరలాయి. ఒక స్త్రీచేత, ప్రపంచంలో ఏ మగవాడైనా అంతలా ద్వేషింపబడటం నిజంగా దురదృష్టకరమే.

''నువ్వా!'' అంటూ థుపుక్కున నేలమీద ఊసి వెళ్ళిపోయింది.

నేను తలవంచుకుని ఇల్లు చేరాను. ఆ రాత్రి ఆత్మహత్య చేసుకోవాలని బలంగా అనిపించింది. పురుగుల మందు సీసాకోసం వెతికితే అది కనిపించలేదు. మందు కనిపించకపోయేసరికి, ఆత్మహత్య తప్పుగా అనిపించింది. తులసికి న్యాయం జరగాలంటే నేను బతకాలి.

ఆమెను పెళ్ళి చేసుకోడానికి నిర్ణయించుకున్నాను. ఆమె మీద జాలితో ఆ నిర్ణయం తీసుకోలేదు. తులసిని చూసిన మరుక్షణం నుంచే ఆమె మీద నాకు ప్రేమ పుట్టింది. ఈ విషయం నా మనసుకు తెలుసు.

మరుసటి రోజు ఉదయాన్నే తులసి ఇంటి దగ్గరికి వెళ్ళి చెట్టుచాటున నిలబడ్డాను. కాసేపటికి తులసి బయటికి వచ్చింది.

నేను దగ్గరికి వెళ్ళి ''నేను చెప్పే ఈ ఒక్కమాట విను తులసీ'' అన్నాను.

ఒక్క క్షణం ఆగింది.

''నా వల్ల నీకు అన్యాయం జరిగిందని తెలుసు. నీ జీవితం ఇలా ఎండిపోవడం నేను చూడలేను. నా తప్పును దిద్దుకునే అవకాశాన్ని ఇవ్వు తులసీ'' అన్నాను.

నా మాటలు అర్థం కానట్టు చూసింది.

''నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను'' అన్నాను.

గుండు దెబ్బ తగిలినట్టుగా ఉలిక్కిపడింది. ''పెళ్ళా? నిన్నా! చచ్చినా చేసుకోను'' అనేసి వెళ్ళిపోయింది.

తరువాత మూడు రోజులు వరుసగా తులసి ఇంటి ముందు పడిగాపులు గాచాను. ఆ సమయానికి తులసి తల్లిదండ్రులు పొరుగూరు వెళ్ళి ఉన్నారు. అప్పుడప్పుడు తలుపు తెరిచేది. నన్ను చూడగానే దడాలున మూసేసేది.

ఈ విషయం ఊరంతా పొక్కిపోయింది. గగ్గోలు బయలుదేరింది. ఒక్క క్షణం నేనా ఊర్లో ఉన్నా విషం తాగి చస్తానని మా నాన్న బెదిరించాడు. నేను బట్టలు సర్దుకొని తిరుపతికి బయలుదేరాను.

ఊరు వదిలేముందు, తులసి ఇంటి దగ్గర నిలబడి కళ్ళు తుడుచుకున్నాను. ఇదంతా తలుపు సందులోంచి తులసి చూసినట్టే అనిపించింది.

కథ చెప్పడం ఆపాడు ప్రకాష్.

''తరువాత ఏం జరిగిందో చెప్పు'' అడిగాను టెన్షన్ తట్టుకోలేక.

ప్రకాష్ నవ్వుతూ భార్య లక్ష్మి వైపు చూశాడు.

నిద్రలో కదులుతున్న బిడ్డని జోకొట్టడం కూడా మరిచిపోయి కథను వింటూ ఉంది ఆమె.

''చెప్పు ప్రకాష్?'' అని మళ్ళీ అడిగాను.

''ఈ కథకు ముగింపు నేను చెపుతాను'' అంది లక్ష్మి.

ఆమె వైపు చూశాను. లీలగా విషయం అరమయ్యింది.

''ఒక్కోసారి అసహ్యంలోంచి కూడా ప్రేమ పుడుతుంది. ఎందుకు ఎట్లా అనే ప్రశ్నలు అనవసరం. వివరణ కూడా అనవసరమే. ఊరు వదిలి బస్సెక్కుతున్న ప్రకాష్ చేతిని తులసి అందుకుంది. నా పూర్తి పేరు తులసీలక్ష్మి'' అంది.

ఆమె పెదవులపై చిరునవ్వు మెరుస్తూ ఉంది.

మహాయోగుల పెదాలపై విరిసే నవ్వు అది!